క్లుప్తంగా

ప్రయాణికురాలి బ్యాగ్ అందజేత



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: పిఠాపురం నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఓ మహిళ బుధవారం ఆటోలో బ్యాగ్ మరచిపోయింది. కుమారుడితో కలిసి స్టేషన్‌లోకి వెళ్లాక బ్యాగ్ లేని విషయాన్ని గమనించింది. ఈ మేరకు అవుట్ పోస్టులో ట్రాఫిక్ ఎస్సైకు ఆమె ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు స్టేషన్ సెంటర్‌లో సీసీ కెమెరాల ఆధారంగా ఆమె దిగిన ఆటోను గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి, ఆటోను రప్పించారు. అందులో ఉన్న బ్యాగ్‌ను బాధితురాలికి ఎస్సై అందజేశారు. బ్యాగ్‌లో విలువైన వస్తువులతో పాటు, పాస్ పుస్తకాలు, ఆధార్, పాన్‌కార్డులు ఉన్నాయి. ట్రాఫిక్ ఎస్సై గరగారావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

సామర్లకోట: రోడ్డు ప్రమాదాలు ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరిగాయి. మద్యం సేవించి వాహనాలు నడపడంతో ఎదుటి వారు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

20న రెవెన్యూ దినోత్సవం

సామర్లకోట: మండలంలో ఈ నెల 20న రెవెన్యూ దినోత్సవం జరుగుతుందని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రెవెన్యూ బోర్డు ఏర్పాటైన సందర్భంగా ఏటా జూన్ 20న రెవెన్యూ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిని పురస్కరించుకుని ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలను వివరిస్తామన్నారు. రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను, సిబ్బందిని సత్కరిస్తామని తెలిపారు.

వాకతిప్పలో క్షీణించిన పారిశుధ్యం



వాకతిప్పలో రోడ్డుపై నిలిచిన మురికి నీరు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో ఎటు చూసినా మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇళ్ల వద్ద చెత్త పేరుకుపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామస్తులు చెత్త వేసేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో చెత్తాచెదారాన్ని వీధుల్లోనే వేసేస్తున్నారు. దీంతో వర్షపు నీటితో చెత్త కలిసి మురికికూపాలుగా మారుతున్నాయి. తద్వారా క్రిమికీటకాలు పెరిగి, వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురికి కాలువలు పొంగిపొర్లుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేద పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



సత్యదేవ మందిరంలో పూజలు చేస్తున్న వేదవర్ధనతీర్థ స్వామీజీ

బోట్‌క్లబ్: వేదాలను పరిరక్షించడం ద్వారా హిందూ సనాతన ధర్మాన్ని కాపాడడమే కాకుండా, రానున్న తరానికి వాటి ప్రయోజనాలు అందించడానికి వీలుంటుందని ఉడిపి శిరూర్ మఠాధిపతి వేదవర్ధనతీర్థ స్వామీజీ అన్నారు. స్థానిక గొడారిగుంటలోని సత్యదేవ మందిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వేద పరిరక్షణ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యమిచ్చేలా ప్రత్యేక ప్రాజెక్టును రూపకల్పన చేస్తున్నామన్నారు. దీనిని విజయవంతం చేయడానికి భక్తులు సహకరించాలన్నారు. వేద అఖిలం ధర్మమూలం అనే నినాదంతో వేద పరిరక్షణకు పలు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వేద మంత్రాలు ఉచ్చరించడం ద్వారా, వినడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందగలమన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సత్యదేవ మందిరంలో స్వామీజీ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్, మందిర నిర్వాహకులు యాతగిరి పరశురామ్ పాల్గొన్నారు.

వంద పడకలేనా..?

- నెరవేరని ఆస్పత్రి అభివృద్ధి
- పీడిస్తున్న వైద్యుల కొరత
- 20 ఏళ్లుగా కాగితాలకే పరిమితం
- అందుబాటులోకి రాని సేవలు



పెద్దాపురంలో వంద పడకల ఆస్పత్రి అనుమతికి సిద్ధంగా ఉన్న భవనం

పెద్దాపురం: ఏళ్ల తరబడి పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి సేవలు కలగా మిగిలిపోయాయి. ఇది ప్రతిపాదనల వద్దే ఆగిపోతుంది మినహా.. కార్యరూపం దాల్చడం లేదు. డివిజన్ పరిధిలోని పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాలతో పాటు, అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం నుంచి ప్రజలు వైద్యం కోసం ఈ ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు.

పెద్దాపురం నడిబొడ్డున ఉన్న ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు హయాంలో పట్టణ శివారు రాజమహేంద్రవరం రహదారిలో పాండవుల మెట్ట సమీపంలో సామాన్య ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఆస్పత్రి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్, వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంత్రిగా ఉన్నప్పుడు ఏరియా ఆస్పత్రి బోర్డు మార్చారే కానీ, వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన మాత్రం కార్యరూపం దాల్చలేదు. ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయింది కానీ, వంద పడకలు, ఆస్పత్రి సేవలు మాత్రం నిలిచిపోయాయి. అప్పట్లోనే వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన తెరపైకి వచ్చినా, కొంతకాలానికే అనపర్తికి మారిపోయింది. తదుపరి ప్రత్తిపాడుతో కలిపి పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి ప్రతిపాదన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

పిఠాపురానికి అనుమతి!

ఈసారి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గమైన పిఠాపురానికి వంద పడకల ఆస్పత్రి అనుమతి రావడంతో, పెద్దాపురం ప్రతిపాదన పూర్తిగా పడకేసింది. ప్రస్తుతం కూటమి నాయకులు చోద్యం చూడడం మినహా దీని ఊసెత్తకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పెద్దాపురం ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే చినరాజప్ప అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపాదన చేశారు. అయినా వంద పడకల ఆస్పత్రి కలగానే మిగిలిపోయింది. గతంలో అనపర్తి, ప్రత్తిపాడు, ప్రస్తుతం పిఠాపురం ఆస్పత్రులకు వంద పడకల అనుమతి లభించింది కానీ, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పెద్దాపురం వంద పడకల ఆస్పత్రి మాత్రం ప్రశ్నార్థకంగా మారింది.



ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులు



రక్త పరీక్షల కోసం ఎదురు చూస్తున్న రోగులు

గత ప్రభుత్వ హయాంలో..

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెరుగైన వైద్య సేవలందించారు. సిబ్బంది కొరత లేకుండా చేయడమే కాకుండాచ స్థానిక పాత ఆస్పత్రి ఆవరణలో, బంగారమ్మ గుడివీధిలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. పట్టణంలో సగం మంది ఆయా అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ రెండు అర్బన్ హెల్త్ సెంటర్లలో కనీస వసతులు కల్పించలేకపోవడం గమనార్హం. ఇక్కడ రెగ్యులర్ వైద్యులను నియమించాల్సి ఉంది.

కొందరు వైద్యులతోనే..

స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సూపరింటెండెంట్, గైనిక్, ఆర్థోపెడిక్ వైద్యులు అన్ని సేవలు అందించాల్సి వస్తోంది. ప్రధానంగా జనరల్ ఫిజీషియన్, చంటి పిల్లల వైద్యులు, జనరల్ సర్జన్, ఎన్ఆర్‌హెచ్ఎం కొరత ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎన్‌బీఎస్‌యూ (న్యూ బోర్న్ సర్వీస్ యూనిట్) ఎంబీబీఎస్ రెగ్యులర్ వైద్యులతో మెరుగైన వైద్య సేవలందించారు. ప్రస్తుతం అవేమీ ఇక్కడ కానరావడం లేదు.

కల నెరవేర్చాలి



ఏళ్ల తరబడి కలగా నిలిచిపోయిన పెద్దాపురం వంద పడకల ఆస్పత్రిపై ప్రభుత్వం స్పందించాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు వంద పడకల ఆస్పత్రి అనుమతిపై దృష్టి సారించాలి. ప్రస్తుత పాలకులు పురప్రజల కల నెరవేర్చాల్సిన అవసరం ఉంది.

– **విజ్జపు రాజశేఖర్**, సీనియర్ కౌన్సిలర్, పెద్దాపురం

పోరాటం చేయాలి



వంద పడకల ఆస్పత్రి అంశం పట్టణానికి సంబంధించినది. పట్టణ ప్రజలతో పాటు, పొరుగు మండలాల వారికి అవసరమైన ప్రతిపాదన ఇది. దీనికి చర్యలు తీసుకునేలా పార్టీలకతీతంగా ప్రభుత్వానికి విన్నవించాలి. వినకపోతే ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలి.

– **డి.క్రాంతికుమార్**, మండల కార్యదర్శి, సీపీఎం, పెద్దాపురం

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పిఠాపురం: మండలంలో వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పిఠాపురం డీఈఈ ప్రభాకర్ తెలిపారు. కుమారపురం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. మండలంలోని కుమారపురం, విరవాడ, ఎల్ఎన్‌పురం, ఆనందనగరం, నాగంపేట, ఎఫ్‌కే పాలెం, జల్లూరు, గోవిందరాజపాలెం, కందరాడల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విద్యుత్ స్తంభాల మార్పు కోసం..

సామర్లకోట: పట్టణంలోని పిఠాపురం రోడ్డులో బ్రౌన్‌పేట నుంచి కోదండరామపురం వరకు విద్యుత్ స్తంభాల మార్పు, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సామర్లకోట ఈఈ ఏవీఎన్‌డీఎన్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. సామర్లకోట–పిఠాపురం రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు విద్యుత్ స్తంభాలు మార్పు చేస్తున్నట్టు చెప్పారు. ఉప్పువారి సత్రం 11 కేవీ ఫీడర్, టిడ్కో సముదాయం బీఆర్ అంబేడ్కర్ ఫీడర్, పిఠాపురం రోడ్డులోని అగ్రికల్చర్ ఫీడర్, డీఎస్‌ఏ ఫీడర్లపై సరఫరా నిలిపివేస్తారన్నారు. బ్రౌన్‌పేట నుంచి టిడ్కో సముదాయం, భాస్కర్‌నగర్, సాయినగర్, సదాశివనగర్, ఎంప్లాయిస్ కాలనీ, మాజేటినగర్, అమ్మణమ్మ అపార్ట్‌మెంట్, జగ్గమ్మగారిపేట, పెద్దాపురం రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పిఠాపురం: ఎనిమిదేళ్ల పాటు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి, బదిలీపై పాఠశాలను వదిలి వెళుతున్న ఉపాధ్యాయులను ఆ ప్రాంతానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించగా, విద్యార్థులు కన్నీటితో వీడ్కోలు పలికారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఎంపీపీఎస్–2 పాఠశాలలో ఇప్పటి వరకు పనిచేసిన వనమాడి జగన్, పెనుగొండ మంగ సూర్యకళ ఇటీవల వేరే పాఠశాలలకు బదిలీ అయ్యారు. వీరు బుధవారం తాము ఇప్పటి వరకు పని చేసిన పాఠశాల నుంచి రిలీవ్ అయి వెళుతుండగా, తల్లిదండ్రులు, వారి పిల్లలు ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఎనిమిదేళ్ల పాటు ఇక్కడ పని చేసి విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకుని, క్రమశిక్షణతో పాటు విలువైన విద్యను అందించారంటూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇప్పటివరకు తమతో ఉన్న ఉపాధ్యాయులు వదిలి వెళ్లిపోతున్నారంటూ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిదండ్రులు, పిల్లలు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అందరి మన్ననలు పొందడం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: వాసవీ వనితా క్లబ్, కపుల్స్ క్లబ్ సంయుక్త సహకారంతో స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాల పంపిణీ జరిగింది. పాఠశాల హెచ్ఎం కె.శ్రీదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సుమారు 150 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, బీజే శేషసాయి, కె.అరుణ, ఏసీవీ కుమారి, ఎ.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు పెద్దఎత్తున ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

పెద్దాపురం: పట్టణంలో ఈ నెల 24 నుంచి మరిడమ్మ జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. స్థానిక మరిడమ్మ ఆలయ కాలక్షేప మండపంలో బుధవారం ఈఓ విజయలక్ష్మి అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ, అమ్మవారి జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆయా శాఖల సిబ్బంది జాతర ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై మౌనిక, ప్రతినిధులు పాలమరశెట్టి సత్తిబాబు, రంది సత్యనారాయణ, తమనార లక్ష్మణ్ దివాకర్, పాటంశెట్టి నాగరాఘవ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన జాతీయ బృందం



కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ, కొమరగిరి గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో చేసిన పనులను బుధవారం నేషనల్ మోనిటరింగ్ టీం సభ్యులు పరిశీలించారు. పొన్నాడలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాల నిర్మాణం, సచివాలయ భవన నిర్మాణం, పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, ఉపాధి హామీ నిధులతో కాలువ నిర్మాణ పనులు, కాకినాడ అర్బన్ లబ్ధిదారులకు కొమరగిరిలో కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణ పనులు, చెరువులో పూడికతీత పనులు, సచివాలయ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పొన్నాడ సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గృహాల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన పనులను నాణ్యతాపరంగా చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని టీం సభ్యులు అధికారులకు తెలిపారు. ఉపాధి కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలన్నారు. టీం సభ్యులు రుషి సింహ, బాలమురళి, జేసీ సునీత, ఏపీడీ వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్ననాటి నేస్తానికి చేయూత



స్నేహితుడికి ఆర్థిక సాయం, సరకులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: కొన్నేళ్ల పాటు తమతో కలిసి చదువుకున్న తమ స్నేహితుడు ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చలించిపోయారు. తాము విడిపోయినా, స్నేహం మాత్రం విడిపోయేది కాదంటూ నిరూపించారు. తమతో పదో తరగతి వరకూ చదువుకున్న స్నేహితుడు పక్షవాతంతో మంచాన పడితే, చిన్ననాటి స్నేహితులు చలించిపోయారు. అతని వైద్యం కోసం ఆర్థిక సాయంతో పాటు, నిత్యావసర వస్తువులు సమకూర్చారు. పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్‌లో 1986 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆంధ్రకేసరులు పేరిట వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. తాము చదువుకున్న స్కూలు స్నేహితులను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో తమతో పాటు చదువుకున్న స్నేహితుడైన రేపల్లి వెంకటరమణకు ఇటీవల పక్షవాతం రావడంతో మంచాన పడ్డాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు అతని వైద్యం, ఫిజియోథెరపీ కోసం బుధవారం రూ.35 వేలు అందజేశారు. వీటితో పాటు నిత్యావసర వస్తువులు సమకూర్చారు. ఏ అవసరం వచ్చినా తామంతా ఉన్నామంటూ భరోసా కల్పించారు. స్నేహితులంతా కలిసికట్టుగా ధైర్యం చెప్పడంతో వెంకటరమణ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

జూలై 15, 16 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మధు తదితరులు

పెద్దాపురం: సామర్లకోటలో వచ్చే నెల 15, 16 తేదీల్లో సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలు జరుగుతాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జట్ల సంఘం కార్యాలయంలో బుధవారం వై.రామకృష్ణ అధ్యక్షతన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి, పేద, అట్టడుగు వర్గాల వారికి తినడానికి తిండి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను తమకు ఆప్తమిత్రులైన వారికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తున్నారని ఆగ్రహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ, పార్టీ విభాగాలు బలపడి, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, త్రిమూర్తులు, వెంకటరమణ, వీరబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు దొరబాబు పరామర్శ



కామేశ్వరరావును పరామర్శిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: పట్టణంలో ఇటీవల అనారోగ్యానికి గురైన బాధితులను, వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న కరణం కామేశ్వరరావు, పార్టీ నాయకుడు నామాల రావు భార్య అనారోగ్యానికి గురి కావడంతో వారి క్షేమ సమాచారాన్ని కుటుంబ సభ్యుల ద్వారా దొరబాబు తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు యార్లగడ్డ జగదీష్, చల్లపల్లి సత్యనారాయణ, నాయకులు పుట్టా సూరిబాబు, చిట్టుమాని శ్రీనివాసు, గోకాడ రాజా ఉన్నారు.

అభివృద్ధే మున్సిపల్ కౌన్సిల్ లక్ష్యం

- వైస్ చైర్మన్, కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మోజెస్, ఆవాల

సామర్లకోట: అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిల్ పని చేస్తుందని వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం మున్సిపల్ కార్యా లయ ఆవరణలో ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా కౌన్సిల్ సభ్యులకు మనస్తాపం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. 2010లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేయగా, జగ్గమ్మగారిపేట గృహ సముదాయం నిర్మాణం జరిగిందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో గృహ సముదాయానికి అమ్మనమ్మనాయుడు అని చంద్రబాబునాయుడు తల్లి పేరు పెట్టుకున్నారని గుర్తుచేశారు. గృహ సముదాయం ప్రారంభించిన సమయంలో పెద్దాపురం ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మకాయల చినరాజప్ప డిప్యూటీ సీఎం, హోం మంత్రి, విపత్తుల శాఖల మంత్రిగా ఉండి కూడా అమ్మనమ్మ అపార్ట్‌మెంట్‌కు రోడ్డు నిర్మించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎంతోకాలంగా సమస్యగా ఉన్న ఎఫ్‌సీఐ రోడ్డును కూడా అప్పట్లో పూర్తిచేయలేకపోయారని విమర్శించారు. ఆయా సమస్యలపై తాము ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులుగా పోరాటం చేశామని తెలిపారు. తమ కౌన్సిల్ అధికారంలోకి వచ్చాక అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సహకారంతో రూ.1.30 కోట్లతో ఎఫ్‌సీఐ రోడ్డు, రూ.1.50 లక్షలతో అమ్మనమ్మ అపార్టుమెంట్ రోడ్డు, డ్రైన్ పనులు పూర్తి చేసినట్టు వివరించారు. ఇది ఎవరు చేసిన అభివృద్ధి అని వారు ప్రశ్నించారు. ఎంతో కాలం సమస్యగా ఉన్న ఫిల్టర్ బెడ్‌ను పూర్తి స్థాయిలో మార్పులు చేసి, స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించారన్నారు. పట్టణంలో సాధారణ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అటువంటి కౌన్సిల్.. అభివృద్ధిని అడ్డుకుంటుందని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకు 50 కౌన్సిల్ సమావేశాల్లో పట్టణ అభివృద్ధికి సంబంధించిన అజెండాలను ఆమోదించినట్టు చెప్పారు. 25 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ తీరును వ్యతిరేకిస్తూ, అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందేలా చేశారని గుర్తు చేశారు. అవిశ్వాస తీర్మానం అనంతరం కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించామని, ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావాలని గత నెల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. ఏనాడూ ఎమ్మెల్యే పనితీరును తప్పు పట్టలేదని, తప్పుడు సమాచారంతో కౌన్సిల్ సభ్యులపై దారుణంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

ప్రస్తుతం రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుందని మాజీ వైస్ చైర్మన్, రైతు నాయకుడు గుణ్ణం రాజబ్బాయి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ అయిందన్నారు. నెల రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించినా, ఇప్పటి వరకు రైతులకు సొమ్ము రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తొలకరి పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని, పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు నేతల హరిబాబు, యార్లగడ్డ జగదీష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసు, వేగి సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసు, కానేటి బుల్లిఅప్పారావు, ముమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- చెరువు గట్టు తవ్వకంపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు



పీబీ దేవంలో బలహీనపడిన ఊర చెరువు గట్టు

సామర్లకోట: మండలంలో పీబీ దేవంలోని ఊర చెరువు నుంచి రక్షణ కల్పించాలని రైతులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. దీనిపై రైతులు విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామంలో చెరువు ఏర్పాటు చేసి వందేళ్లు దాటిందన్నారు. అటువంటి చెరువులో తన భూమి కలిసిపోయిందనే నెపంతో సర్వే చేయించి, చెరువు గట్టును తవ్వించినట్టు రైతులు ఆరోపించారు. గట్టు తవ్వకం వల్ల గట్టు బలహీన పడిందని, చెరువులో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు గండి పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పొలాలతో పాటు, గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. చెరువు గట్టు తవ్వకం చేసిన సమయంలో రెవెన్యూ అధికారులు ఎందుకు లేరని రైతులు ప్రశ్నించారు. తవ్వకం చేయగా వచ్చిన మట్టి ఏమైందని నిలదీశారు. మట్టిని గట్టుపై వేసి పటిష్టం చేయాల్సి ఉందన్నారు. దీనిపై విచారణ చేసి, న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డిని వివరణ కోరగా, గట్టు సమీపంలో ఉన్న భూమి యజమాని తన భూమి తక్కువ వచ్చిందని చెప్పడంతో, సర్వే చేసి చెరువు గట్టులో కొంత మేరకు ఉన్నట్లు సర్వేయర్ గుర్తించారని తెలిపారు. మక్కులు వేసిన దానికంటే ఎక్కువగా గట్టు తవ్వకం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. తవ్వకం చేయగా వచ్చిన మట్టిని గట్టుపైనే వేయాలని తెలిపారు. దీనిపై ఈ నెల 21న ఇరిగేషన్ అధికారులతో కలిసి తిరిగి సర్వే చేస్తారని చెప్పారు.